

రేపు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం : డీఈవో

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో శనివారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని డీఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను ఆహ్వానించి ఎక్కువసంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. మన బడిలో ఆహా రోత్సవంపై చర్చించాలని, ఇటీవల విద్యార్థుల ఫలితాల సాధనపై చర్చించి ప్రగతి ప్రశంసించాలని సూచించారు. తల్లిదండ్రులు పోషక విలువలతో కూడిన ఆహారం తయారు చేసి తీసుకొచ్చేలా ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశ వివరాలు ఐఎస్ఎంఎస్ పోర్టల్, స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.



లక్ష్యం దిశగా ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో ముగింపు దశకు చేరిన ధాన్యం సేకరణ
- ఈ ఏడాది దొడ్డు రకంతో పాటు కొనుగోలు కేంద్రాలకు పోటెత్తిన సన్నరకం ధాన్యం
- 262 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ
- జిల్లాలో ఇప్పటి వరకు 28,780 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం కొనుగోళ్లు
- సన్నరకం విక్రయాలపై అన్నదాత ఖాతాలో వచ్చి చేరుతున్న బోనస్
- ఇప్పటికి 70 కొనుగోలు కేంద్రాల ద్వారా కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు

ఖానాపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతు పండించిన పంటను దళారుల పాలు కాకుండా ప్రభుత్వం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోళ్లు జిల్లాలో లక్ష్యసాధన దిశగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 262 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోళ్లను నిర్వహిస్తోంది. ఈసారి నిర్మల్ జిల్లాలో దొడ్డురకం, సన్నరకం 1,46,875 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. వారి అంచనా ప్రకారం ఇప్పటికే జిల్లాలో 1,07,345 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించారు. గతానికి భిన్నంగా తొలిసారి ఈ ఏడాది సన్నరకం ధాన్యం కూడా కొనుగోలు కేంద్రాలకు విక్రయానికి వచ్చింది. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఇక ముగింపు దశకు చేరుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో 262 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా ఇప్పటి వరకు 192 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ పూర్తి కావడంతో జిల్లావ్యాప్తంగా మరో 70 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లను నిర్వహిస్తున్నట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకు ఎంఎస్పీ ధరతో పాటు క్వింటాల్ ధాన్యంపై రూ. 500ల చొప్పున బోనస్ కూడా జమ చేస్తున్నట్లు అధికార యంత్రం చెబుతోంది. ఇప్పటి వరకు 50 శాతానికి పైగా రైతులకు ఎంఎస్పీ ధరతో పాటు బోనస్ కూడా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెబుతున్నారు.

లక్ష్యం దిశగా ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో వచ్చిన పంటను కొనుగోలు చేసేందుకు మొత్తం 388 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో 308 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇందులో 189 దొడ్డు రకం, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, 119 సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కాగా మొత్తం 262 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా దొడ్డురకం, సన్నరకం కలిపి 1,46,875 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా టార్గెట్‌ను సిద్ధం చేసుకున్న అధికారులు ఇప్పటి వరకు 1,07,345 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. ఇందులో 78,565 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యాన్ని, 28,780 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఇంకా 70 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ కొనసాగుతుందని చెబుతున్న అధికారులు టార్గెట్‌కు చేరువగా వస్తామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ (ఫైల్)

గతానికి భిన్నంగా కొనుగోలు కేంద్రాలకు పోటెత్తిన సన్నరకం ధాన్యం

గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కేవలం దొడ్డు రకం ధాన్యాన్నే విక్రయించే రైతులు సన్నరకం ధాన్యాన్ని మాత్రం బయట మార్కెట్‌లో అమ్ముకునే వారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సన్నరకం ధాన్యానికి వెచ్చించే మద్దతు ధర కంటే బయట మార్కెట్‌లో సన్నరకం ధాన్యానికి 200 నుంచి 300ల రూపాయలు అదనంగా వస్తుండడంతో రైతులు బయట వ్యాపారులనే ఆశ్రయించేవారు. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాల్ ధాన్యంపై రూ.500ల బోనస్ అందజేస్తున్నట్లు ప్రకటించడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఒకటి, రెండు వెరైటీలు మినహా మిగతా సన్న రకాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు రైతులు మొగ్గు చూపారు. దీంతో జిల్లాలో ఏర్పాటు చేసిన 119 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 28,780 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం విక్రయానికి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 6,180 మంది రైతులు సన్న రకం వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించినట్లు చెబుతున్నారు. వీరికి ఎంఎస్పీ ధరతో పాటు క్వింటాల్‌కు అదనంగా రూ. 500ల బోనస్‌ను సైతం అందజేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సన్న రకం ధాన్యం విక్రయించిన రైతులకు వారి ఖాతాలకు నేరుగా ప్రభుత్వం రూ. 11.20 కోట్లను బోనస్ రూపంలో జమ చేయనున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే 50 శాతం మంది రైతులకు బోనస్ వారి వారి ఖాతా ల్లో జమైనట్లు అధికారులు చెబుతున్నారు. మిగతా వారికి సైతం ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో బోనస్ డబ్బులను జమ చేస్తుందని చెబుతున్నారు.

ఎప్పటికప్పుడు చెల్లింపులు

జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం తాలూకు డబ్బులను వెనువెంటనే సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు అధికార యంత్రాంగం స్పష్టం చేస్తోంది. జిల్లాలో ఏర్పాటు చేసిన దొడ్డు రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 17,794 మంది రైతుల నుండి 78,565 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తం ధాన్యానికి గాను రూ. 182 కోట్ల డబ్బులను చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ. 158 కోట్ల డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 6,180 మంది రైతుల నుంచి 28,780 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఆ ధాన్యం తాలూకు రైతులకు రూ. 66 కోట్లను చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ. 52 కోట్ల డబ్బులను సంబంధిత సన్నరకం ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెబుతున్నారు. మిగతా డబ్బులు సైతం వెంట వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

ధాన్యం సేకరణపై నిరంతర పర్యవేక్షణ

జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం సేకరణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహిస్తున్నాం. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు ఖాతాల్లో డబ్బులు జమ చేయడంలో ఎటువంటి జాప్యం జరగకుండా చర్యలు చేపడుతున్నాం. సన్న రకం ధాన్యాన్ని విక్రయించిన రైతులకు ఎంఎస్పీ ధర ప్రకారం వెనువెంటనే డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. సన్నరకం ధాన్యం విక్రయించిన రైతులకు ఎంఎస్పీ ధర ప్రకారం ఖాతాల్లో జమైన డబ్బుల ఆధారంగా ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాల్లోనే బోనస్ డబ్బులను జమ చేస్తోంది. ఇప్పటి వరకు జిల్లాలో 50 శాతానికి పైగా రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ అయ్యాయి.

కిషోర్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్, నిర్మల్

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలపై

నేడు ఫోన్ చేయండి : డీఎం

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ప్రయాణికులు సమస్యలపై శుక్రవారం తనకు ఫోన్‌చేయాలని డీఎం ప్రతిమారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అందుబాటులో ఉంటానన్నారు. బస్సుల సమయపాలన, ట్రిప్పుల సంఖ్య, సమస్యలపై సమాధానాలు లభిస్తాయన్నారు. ఫోన్ చేయాల్సిన నెంబర్ 9959226003.

ఐడియల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు సన్మానం

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం ఐడియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ బెస్ట్ స్కూల్ అవార్డు సాధించిన సందర్భంగా ప్రిన్సిపాల్ షబ్బీర్ అహ్మద్‌ను ఏక్తా సంఘం గురువారం సన్మానించింది. అధ్యక్షుడు షైక్ ముజాహిద్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ సాజిద్, గౌరవ సలహాదారు వసీం, షకీల్, ప్రధాన కార్యదర్శి అల్మాస్, తదితరులు పాల్గొన్నారు.

చలితో విద్యార్థులు వణుకుతున్నారు

పాఠశాల వేళలు మార్చండి : టీజీవీపీ

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పాఠశాల విద్యార్థులు తీవ్ర చలి ప్రభావంతో వణికిపోతున్నారని పాఠశాల పనివేళలు మార్చాలని టీజీవీపీ అధికారులను డిమాండ్ చేసింది. అధ్యక్షుడు కే.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ... ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో రోజు రోజుకు చలి పెరుగుతోందన్నారు. చలితో ఇబ్బందులు పడుతున్నందున అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

మానవహక్కుల

కౌన్సిల్ ప్రతినిధుల ఎంపిక

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలోని పలు మండలాలకు మానవ హక్కుల కమిటీ ప్రతినిధులను నియమించారు. వీరికి నియామక పత్రాలు రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎస్. పండరి, నిర్మల్ డైరెక్టర్ ఠాగూర్ దత్తు సింగ్ గురువారం అందజేశారు. పండరి మాట్లాడుతూ... సామాజిక సేవలక్ష్యంగా ప్రభుత్వ పథకాలు బడుగు, బలహీన వర్గాలకు అందేలా చూడాలని సభ్యులకు సూచించారు. బాల్య వివాహాలు అరికట్టడం సహా బాల కార్మికుల నిర్మూలన, మాదక ద్రవ్యాలు, తదితర వాటిపై చట్టరీత్యా చర్యలు తీసుకునేలా చూడాలన్నారు.

హోటల్ యజమాని శివాజీకి మాజీ మంత్రి శ్రద్ధాంజలి



శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీమంత్రి ఐకే రెడ్డి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని మయూరి హోటల్ యజమాని వెలగపూడి శివాజీకి మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం శ్రద్ధాంజలి ఘటించారు. ఇటీవల ఆయన పరమపదించారు. ఏఎన్‌రెడ్డి కాలనీలోని ఆయన నివాసంలో వైకుంఠ సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఇంద్రకరణ్‌రెడ్డి హాజరై శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. శివాజీ మృదుస్వభావి అని ప్రజల మన్ననలు అందుకున్నారని కొనియాడారు. శివాజీ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మనోధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఆయనకు సద్గతులు కలగాలని భగవంతుడిని ప్రార్థించారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇర్ఫాన్‌షేక్



నిర్మల్ అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : టీచర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇర్ఫాన్‌షేక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జుమ్మేరాత్‌పేట్ హైస్కూల్‌లో హెడ్‌మాస్టర్ అల్లం రవిబాబుతో పాటు టీచర్లు ఇటీవల రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఇర్ఫాన్‌షేక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ షేక్ మాట్లాడుతూ... టీచర్ల సమస్యల పరిష్కారంపై ఎప్పటికప్పుడు సంఘ, రాష్ట్ర బాధ్యులకు వివరించి వారి సహకారంతో సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు. ఇప్పటికే ఎస్టీయూ ఆధ్వర్యంలో టీచర్ల సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయని తెలిపారు. ఎస్టీయూ ప్రాతినిధ్యం మేరకు ప్రభుత్వం ఇప్పటికే సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం హెడ్‌మాస్టర్ అల్లం రవిబాబు మాట్లాడుతూ... తమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇర్ఫాన్‌షేక్ ఎస్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియమించబడడం తమకు గర్వకారణం అన్నారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు దత్తురాం, వసంతరావు, మల్లేశం, మనోహర్, సుదర్శన్, ఖమరుల్లా, గంగాధర్, దయానంద్, వినోద్, గంగాధర్, రమణ, శ్రీమంత్, మంజుల, హేమలత, ప్రసూయ, శృతి, హారిక, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులంతా విద్యకు, క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలి

- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



క్రీడల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విజేతలకు పతకాలు అందజేస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్ అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులంతా విద్యకు, క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక ఎన్టీఆర్ మినీస్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ పోటీల ముగింపు వేడుకల్లో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి నేటి వరకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులకు పతకాలను, కప్పులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడా పోటీల్లో విజయం సాధించకపోయినప్పటికీ పోటీల్లో పాలుపంచుకోవడం కూడా గొప్ప విషయమని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రీడలను తమ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. క్రీడల్లో అందించు పలు ధ్రువీకరణ పత్రాలు భవిష్యత్తులో ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత కలిగి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఏసీఈజీ పద్మ, జిల్లా బలపింక్స్ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ శ్యాముల్, ఎస్‌జీఎఫ్ రవీందర్ గౌడ్, సెక్రటరీ, విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్స్ మైత్రి క్లినిక్ ప్రారంభం

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో గురువారం ట్రాన్స్ జెండర్స్ ప్రత్యేక మైత్రి క్లినిక్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ట్రాన్స్‌జెండర్స్ వివక్ష రహిత వైద్యసేవలు పొందేందుకు ప్రభుత్వం మైత్రి క్లినిక్ ప్రారంభించినట్టు తెలిపారు. గుర్తింపు కార్డులతో ఇక్కడ వైద్యం పొందాలన్నారు. గుర్తింపు కార్డులకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. గౌరవప్రదంగా సేవలు పొందాలన్నారు. వైద్యాధికారి రాజేందర్, ఏఎంసీ చైర్మన్ భీమ్ రెడ్డి, పర్యవేక్షకుడు గోపాల్ సింగ్, సీడీపీవో నాగమణి పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- టీజీ బ్యాంక్ చైర్మన్ వై. శోభ

దిలావర్‌పూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బ్యాంక్ ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి బాటలు వేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్ పర్సన్ వై. పద్మ అన్నారు. దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నూతన భవనాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందన్నారు. గ్రామీణ ప్రజల ఆదరాభిమానంతోనే టీజీబీ ఉన్నతస్థితికి చేరిందన్నారు. గ్రామాల్లోని రైతులకు, వ్యాపారులకు, తమ ఖాతాదారులకు అవసరమైన రుణాలను ఇచ్చి వారి ఆర్థిక మెరుగుదలకు కృషి చేస్తుందన్నారు. అలాగే మహిళల ఆర్థిక స్వాలంబన కోసం టీజీబీ తోడుగా ఉంటుందన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు స్వయం ఉపాధి కోసం విరివిగా రుణాలు ఇస్తూ మహిళల ఆర్థిక వృద్ధికి చేయూత అందిస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతేనే కుటుంబం బాగుంటుందన్నారు. ఆర్థిక లావాదేవీల విషయంలో మహిళలు నిజాయితీగా ఉంటారన్న ఉద్దేశ్యంతో బ్యాంక్‌లు మహిళలకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వస్తాయన్నారు. ప్రతి మహిళా ఒక ఆర్థిక శక్తిగా ఎదగాలని అన్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించడం ద్వారా మరికొందరికి సహాయంచేసిన వారమవుతామన్నారు. ఇకపై కూడా మన తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులకు ఇంకా మెరుగైన సేవలు అందిస్తుందని చెప్పారు. బ్యాంక్ సిబ్బంది సైతం మన ఖాతా దారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. దురుసుగా ప్రవర్తించకుండా ఓపికగా సమాధానం చెప్పాలన్నారు. వినియోగదారులను బ్యాంక్ చుట్టూ తిప్పుకోకుండా పని ఎప్పుడు పూర్తవుతుందో చెప్పి ఆ గడువులోగా వారి పని పూర్తి చేయాలని, ఊరికే బ్యాంక్ చుట్టూ తిప్పుకోవద్దని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా మన బ్యాంక్ ఖాతాదారులతో మర్యాదగా ప్రవర్తించాలని మరోసారి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ డీవీఎస్ రామారావు, బ్రాంచ్ మేనేజర్ పీఆర్ అశోక్, ఆఫీసర్ సాయాజీ, ఇతర బ్యాంక్ సిబ్బంది, ఎస్ఎస్‌జీ సంఘాల మహిళలు, రైతులు, బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.



తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న టీజీబీ చైర్‌పర్సన్

'మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిపై అర్థరహిత ఆరోపణలు మానుకోవాలి'



విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మెన్ పాటిల్, డైరెక్టర్లు తోట రాము, ఎన్.భూమన్న, సాయినాథ్ తదితరులు

భైంసా, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ శ్రేణులు అభివృద్ధి పనుల మంజూరి విషయంలో ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపై అర్థరహిత ఆరోపణలు మానుకోవాలని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్, డైరెక్టర్లు తోట రాము, ఎన్.భూమన్న, సాయినాథ్‌లు సూచించారు. గురువారం భైంసాలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. భైంసా పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, ప్రతినిధి రావుల పోశెట్టిలు మెదరి సంఘ భవన నిర్మాణ మంజూరిపై అవగాహన లోపంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రతిపాదన మేరకు మెదరి సంఘ భవన నిర్మాణానికి ఆగస్టు మాసంలో ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.2.5 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. ఇదే నిర్మాణంపై ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ ప్రతిపాదన మేరకు డిసెంబర్ మాసంలో రూ.2.5 లక్షలు మంజూరయ్యాయని వివరించారు. ఇందులో భాగంగానే తన ప్రతిపాదన మేరకు రూ.2.5 లక్షలతో మంజూరైన మెదరి సంఘ భవన నిర్మాణ ప్రొసిడింగ్ కాపీని మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సంబంధిత కులస్తులకు అందచేయడం జరిగిందన్నారు. అయితే సంబంధిత విషయంలో పరిజ్ఞానం లేకుండా భైంసా పట్టణ బీజేపీ ప్రతినిధులు స్థాయిని మరిచిపోయి ఇష్టరాజ్యంగా మాట్లాడం సబబు కాదన్నారు. మాజీ ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి పనులతో బెంబేలెత్తిపోతున్న బీజేపీ ప్రతినిధులు ఆయనను అప్రతిష్టపాలు చేసేందుకు దిగజారుడు విధానాలను అవలంబించడం సరికాదన్నారు. తీరు మార్చుకోకపోతే గుణపాఠం నేర్చుకోక తప్పదని వెల్లడించారు.

అర్హులైన లబ్ధిదారులకు

ఇందిరమ్మ ఇళ్లు : కలెక్టర్



సర్వే పర్యవేక్షిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన లబ్ధిదారులకు సర్వే తరువాత ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం 33వ వార్డు భాగ్యనగర్ కాలనీలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో కలెక్టర్ పాల్గొన్నారు. సర్వే పారదర్శకంగా ఉండాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ రాజు, కమిషనర్ ఖమర్ అహ్మద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనిరుద్, కాలనీ వాసులు అడపా శ్రీకాంత్, డీఎస్ రాజేశ్వర్, రంగు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు రూ.4 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరు



ప్రొసీడింగ్ కాపీని నాయకులకు అందజేస్తున్న నారాయణరావు పాటిల్

లోకేశ్వరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ నియోజకవర్గానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా సీసీ రోడ్డు పనులకు 4 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ శాసన సభ్యులు నారాయణ రావు పాటిల్ అన్నారు. అలాగే ప్రొసీడింగ్ కాపీని నాయకులకు అందజేయడం జరిగింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు, మాజీ శాసనసభ్యులు నారాయణరావు పటేల్‌కి ధన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో లోకేశ్వరం మండల అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, ముథోల్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్‌షఫీ, మండల కమిటీ ప్రధాన కార్యదర్శి సుధీర్ రెడ్డి, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమ కళాకారుల ఆత్మగౌరవ సదస్సు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కళాకారుల ఆత్మగౌరవ సదస్సు శనివారం మధ్యాహ్నం 12 నుంచి హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య భవనంలో నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా చైర్మన్ కొట్టే శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్ర ఫోరమ్ చైర్మన్ చీమ శ్రీనివాస్ అధ్యక్షత వహిస్తారన్నారు. రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ కోదండరాం, తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా నుంచి అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అత్యాచార యత్నం కేసులో

ఒకరికి నాలుగేళ్ల జైలు

కుబీర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచార యత్నం కేసులో మండలంలోని చాతా గ్రామానికి చెందిన నిందితుడు ఐనవేని నర్సయ్యకు నాలుగేళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమాన విధిస్తూ కోర్టు గురువారం తీర్పును వెల్లడించింది. కోర్టు ఇన్‌చార్జిన్యాయాధికారి గురువారం తీర్పుఇచ్చారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

● కలెక్టర్ రాజర్షి షా



స్వెట్టర్‌లను పంపిణీ చేస్తున్న కలెక్టర్

భీంపూర్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆయన గురువారం మండలంలోని ఇందుర్‌పల్లి, అర్లి (టి)గ్రామాలను సందర్శించారు. ఇందుర్ పల్లి గ్రామంలో ఇండియన్ డెంటల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఇందుర్ పల్లి, అర్లి (టీ) గ్రామస్తులకు స్వెటర్లను పంపిణీ చేశారు. అలాగే ఇందుర్ పల్లిలో అంగన్ వాడి సెంటర్‌ను పరిశీలించారు. పిల్లలకు దుస్తులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చలి తీవ్రత అధికంగా ఉందని, ఉత్తరాది నుంచి విస్తున్న చలిగాలులతో ఇక్కడ ఉష్ణోగ్రత కనిష్ఠంగా నమోదు అవుతోందని అన్నారు. వృద్ధులు, పిల్లలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. గ్రామస్తులు చెడు అలవాట్లు గుట్కా, పొగాకు, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. గ్రామాలలో ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని, అందుకు గ్రామాల్లోఉన్న సమస్యలపై ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీవో గోపాల కృష్ణ రెడ్డిని ఆదేశించారు. అనంతరం అర్లి టీ నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, ఇండియన్ డెంటల్ అసోషియేషన్ అధ్యక్షుడు సమీ యుద్దీన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన,మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, తహసీల్దార్ నలంద ప్రియ, మెడికల్ ఆఫీసర్ నిఖిల్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

జనవరి 2 నుంచి జంగుబాయి ఉత్సవాలు

ఉట్నూర్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లాలోని చిరవేరి మండలం జంగుబాయి దేవస్థానంలో జనవరి 2 నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ గౌరవ అధ్యక్షులు మరపబాజీరావు తెలిపారు. గురువవారం ఉట్నూర్ మండలంలోని సాలెవాడ బి గ్రామంలో నిర్వహించిన ఆదివాసీ గ్రామ ప్రజల సమావేశంలో ఆయన మాట్లాడారు. జంగుబాయి ఉత్సవాల్లో భాగంగా 13న మహాపూజ, 28న ఆలయ శుద్ధీకరణ ఉంటుందన్నారు. జిల్లా అధికారులు జంగుబాయి దేవస్థానంకు ఇవ్వాల్సిన నిధులను సకాలంలో ఇవ్వకుండా తిప్పుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో మరపరోహిదాస్, మరప లింగు, మరప గోదిరావు ఉన్నారు.

పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలి

బోథ్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు గత 4నెలల నుంచి వేతనాలు రావడం లేదని వేతనాలు వెంటనే ఇప్పించాలని కోరుతూ గురువారం స్థానిక ఎంపీడీవో రమేష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పారిశుద్ధ కార్మికుల సంఘం అధ్యక్షులు కలిగేటి గంగయ్య, కార్యదర్శి సాగర్‌తో పాటు ధనుర్ గ్రామ పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్షుడు జైపాల్, కార్మికులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

తాంసి, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండల నాగపూర్ గ్రామంలో సురుకుంటి మంజుల శ్రీధర్‌రెడ్డి అయ్యప్ప స్వామికి నైవేద్య పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి అయ్యప్పస్వాములు పెద్దఎత్తున హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వచ్చిన అయ్యప్ప స్వాములకు నిర్వాహకులు భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి గురు స్వాములు సంతోష్ రావు, శ్రీనివాస్, మహేష్, ఎల్మ గంగారెడ్డి హాజరయ్యారు.

పురుగుల మందు తాగి కాంట్రాక్టు ఉద్యోగి ఆత్మహత్య

తాంసి, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాంసి గ్రామానికి చెందిన కాంట్రాక్టు ఉద్యోగి కాడిగిరి సంతోష్ (27) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంతోష్ మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో సంతోష్ గురువారం సాయంత్రం సబ్‌స్టేషన్‌లోనే పురుగుల మందు తాగడాన్ని తోటి సిబ్బంది గమనించి జిల్లాకేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారంరాత్రి 8గంటల ప్రాంతంలో ఆయన మృతిచెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతునికి తల్లి, భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాంసి పోలీసులు పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఉద్యమ నాయకుడి మృతి

తాంసి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ సమయంలో చురుగ్గా పాల్గొన్న డాక్టర్ తులసిరామ్ (49) అనారోగ్య సమస్యలతో మృతిచెందారు. మండలంలోని గిరిగావ్ గ్రామానికి చెందిన తులసీరామ్ గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. గురువారం సాయంత్రం ఆయన మృతిచెందాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో బోథ్ నియోజకవర్గంలో ముందుండి పోరాటం చేసిన గుర్తింపు ఈయనకు ఉంది. బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్‌గా, విద్యార్థి ఉద్యమ నాయకుడిగా, రాజకీయ విశ్లేషకుడిగా ఈయనకు పేరుంది. ఎలాంటి పదవులు చేపట్టకపోయినా తెలంగాణ ఉద్యమంలో మాత్రం కీలకపాత్ర పోషించినట్లు పలువురు పేర్కొన్నారు. తులసిరాముకు భార్య నలుగురు పిల్లలు ఉన్నారు. ఆయన అంత్యక్రియల్లో ఆయా పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని నివాళులర్పించారు.

చలి తీవ్రత తట్టుకోలేక వృద్ధురాలి మృతి

ఇంద్రవెల్లి, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరాపూర్ గ్రామానికి చెందిన మడావి జంగుబాయి (77) చలి తీవ్రతను తట్టుకోలేక గురువారం ఉదయం మృతిచెందింది. కొన్నిరోజులుగా చలితీవ్రత ఎక్కువ కావడంతో ఇబ్బంది పడుతుండేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

ముగిసిన నాగోబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ఇంద్రవెల్లి, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా ముగిశాయి. గురువారం నాగోబా ఆలయంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్ ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజన వేదపండితుల కుమ్ర దత్త మహారాజ్ మంత్రోచ్ఛరణల మధ్య హోమం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెస్రం వంశీయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి హోమంలో పాల్గొన్నారు. అనంతరం విష్ణు మహారాజ్ ఆధ్వర్యంలో భక్తులకు కీర్తనలు ఆలపించారు. మెస్రం వంశీయులు తరలి వచ్చిన భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మెస్రం చిన్ను పటేల్, మెస్రం దేవ్‌రావు, మెస్రం శేఖర్‌బాబు, మెస్రం నాగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో ముథోల్ సమస్యలపై ఎమ్మెల్యే ఏకరువు



భైంసా, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యలపై ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ అసెంబ్లీ సమావేశంలో ఏకరువు పెట్టారు. గురువారం అసెంబ్లీ సమావేశంలో నియోజక వర్గ పరిధిలోని పలు సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గత పాలకుల నిర్లక్ష్యపూరిత ధోరణి విధానాల మూలంగా ముథోల్ నియోజకవర్గం అన్నింటా నిరాదరణకు, వివక్షతకు గురైందని తెలిపారు. ప్రధానంగా వ్యవసాయ రంగానికి సాగునీటి వ్యవస్థను మెరుగపరచేందుకు గాను బ్రహ్మేశ్వర్ ఎత్తిపోతల పథకం, గడ్డెన్నవాగు ప్రాజెక్టు, కాళేశ్వరం 28వ ప్యాకేజీకి సంబంధించి నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించి రైతాంగ సంక్షేమానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిధిలోని గత ప్రభుత్వ హయాంలో 190 చెరువులు మరమ్మతులకు నోచుకోలేదని వాటి మెరుగుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. బాసర ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు, రాబోయే గోదావరి పుష్కరాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన నిధులను కేటాయించి పనులు సత్వరమే జరిగేలా కృషి చేయాలని కోరారు. ముథోల్ కేంద్రంలో వ్యవసాయ పరిశోధన కేంద్రానికి అనుబంధంగా వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. భైంసా ఏరియా ఆసుపత్రిలో రోజురోజుకు రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న దృష్ట్యా 100 నుంచి 150 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు.అంతకు ముందు ముథోల్ ఎమ్మెల్యే పార్టీకి చెందిన ఇతర ఎమ్మెల్యేలతో ఎడ్లబండిపై అసెంబ్లీకి తరలివెళ్లారు .

సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

ముథోల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని ఆయా గ్రామాల్లో సీసీ రోడ్డు, మురికి కాలువల నిర్మాణంకు రూ. 37 లక్షల 80 వేలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ముథోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగారెడ్డి తెలిపారు. గురువారం ముథోల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

రైతు సమస్యలపై సర్కారు నిర్లక్ష్యం

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్



ఎడ్లబండిపై అసెంబ్లీకి వస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్‌రూరల్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ఆరోపించారు. రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ గురువారం బీజేపీ ఎమ్మెల్యేలు శంకర్, రామారావ్ పటేల్, పాల్వాయి హరీష్‌బాబు ఎడ్లబండిపై అసెంబ్లీకి ఇచ్చారు. ఇక్కడ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. రైతులకు న్యాయం చేయాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం అవుతున్న నేటి రైతు సమస్యలు సమస్యలుగానే ఉన్నాయన్నారు. ఈ సమస్యలపై అసెంబ్లీలో చర్చ జరగాలని డిమాండ్ చేశారు. పంట బీమా, రైతు భరోసా పథకాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. కొంత మందికి వేసి మిగిత వారిని విస్మరించిందన్నారు. రైతుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే వరకు బీజేపీ తరపున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

చనక-కొరాట ప్రాజెక్టును పూర్తి చేయాలి

ఆదిలాబాద్ జిల్లాలో 65వేల ఎకరాల ఆయ కట్టుకు సాగు నీరు అందించే చనాక-కొరాట ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం శాసన సభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో 90శాతం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని, మిగిలిన 10 శాతం పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాలని కోరారు.

అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తు అరెస్టులు

ఉట్నూర్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేపట్టొద్దని మాల మహానాడు ఆధ్వర్యంలో గురువారం తలపెట్టిన అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా మాలమహానాడు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. బుధవారం రాత్రి నుంచి ఉట్నూర్ మండలంలోని మాల మహానాడు సంఘం నాయకులు కాటం రమేష్, సుశీల్, తొటిఆశన్నలనుపోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేసి హైదరాబాద్ వెళ్లకుండా బైండోవర్ చేసి గురువారం ఉదయం వదిలిపెట్టారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీలను వర్గీకరించడానికి పూనుకోవడం సరైనదని కాదని అన్నారు. శాంతియుత పోరాటాలు చేస్తున్న తాము ఎస్సీ వర్గీకరణ ఆగేంత వరకు ఉద్యమాలు చేస్తామన్నారు.

20 నుంచి 22 వరకు పత్తి పంట కొనుగోలు నిలిపివేత

బోథ్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని స్వప్న రాఘవేంద్ర సాయి దత్త జిన్నింగులలో పత్తి పంట నిల్వలు పేరుకుపోయినందున ఈనెల 20 నుండి 22 వరకు పంట కొనుగోలు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి విట్టల్ తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి 23వ తేదీ వరకు పత్తి పంటను తీసుకురావద్దని ఆయన కోరారు.

క్రీడలను ప్రోత్సహించేందుకే సీఎంకప్ పోటీలు

● ఓలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బాలూరి గోవర్ధన్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులతోపాటు క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు సీఎం కప్ పోటీలు ఎంతో దోహదం చేస్తాయని ఓలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడ పోటీలు కొనసాగుతున్నాయి. గురువారం హాకీ, కరాటే, జుడో, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా ఓలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలను అభివృద్ధి చేసేందుకు సీఎం ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. జిల్లాస్థాయిలో ఆయా విభాగాల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో మెడల్స్ సాధించాలన్నారు. సీఎంకప్ పోటీల్లో భాగంగా జిల్లాలో తొలిసారిగా సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి శుక్రవారం ఉదయం సైకిలింగ్ పోటీలు ప్రారంభమవుతాయని, ఔత్సాహికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, గిరిజన క్రీడలాభివృద్ధి అధికారి పార్థసారథి, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, కోచ్‌లు, పీఈటీలు పాల్గొన్నారు.

గజగజ!

(ఐదవ పేజీ తరువాయి)

కూడా మరోకారణంగా చెబుతున్నారు. గురువారం బేల మండలంలో 6.4, బోథ్‌లో 7.2, మావలలో 7.3, జైనథ్‌లో 7.5, ఆదిలాబాద్ అర్బన్‌లో 8.1, గాదిగూడలో 9.4, తలమడుగులో 10.0 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో కొద్దిరోజులుగా 15డిగ్రీలలోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

● పంటలపై ప్రభావం

జిల్లాలో కురుస్తున్న దట్టమైన పొగమంచుతో పంటలపై ప్రభావం పడుతుందని రైతులు చెబుతున్నారు. పత్తి, మొక్కజొన్న, శనగ పంటలను చీడపీడలు ఆశిస్తున్నాయని చెబుతున్నారు. అయితే శనగపంట ఎదుగుదలకు పొగమంచు మేలు చేస్తోందని చెబుతున్నారు. అయితే తీవ్రమైన చలితో చాలా రకాల పంటల్లో ఎదుగుదల నిలిచిపోతున్నట్లు తెలుస్తోంది. అలాగే పశువులు కూడా చలికి అనారోగ్య బారీన పడే అవకాశం ఉండడంతో రాత్రివేళల్లో పశువుల పాకలు, ఇళ్లలోనే పశువులను ఉంచుతున్నారు. కొందరైతే పశువులకు గోనెసంచులు కప్పి వెచ్చదనాన్ని కల్పిస్తున్నారు. జిల్లా కేంద్రంతోపాటు బోథ్ మండలం గుర్రాల తండా, తలమడుగు మండలం కోసాయి, ఉమ్రి, భీంపూర్ మండలం అర్లి (టి) గిరిజన గ్రామాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో చలితీవ్రతతో గిరిజన గ్రామాలు గజ గజవణికి పోతున్నాయి. ఉదయం 10 గంటల వరకు జనం బయటకు రావడానికి జంకుతున్నారు. సాయంత్రం 4 గంటలకే ఇళ్లలోకి తిరిగి వెళ్లిపోతున్నారు.

'సీఆర్టీల సమస్యలను పరిష్కరించాలి'

ఉట్నూర్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్సి టీచర్ల సమస్యలను ప్రభుత్వ పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘంజిల్లా అధ్యక్షుడు మూగ ఎనిఆస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్‌అశోక్‌కుమార్‌లు కోరారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలని ఐటీడీఏలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ వసంతరావును కలిసి మెమోరాండం సమర్పించారు. సీఆర్టీలకు మినమం టైంస్కేల్ కల్పించాలని, సీఆర్టీలను క్రమబద్ధీకరించాలని, ప్రతీనెల 1న వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ సీఆర్టీల సమస్యల పరిష్కారం కోసం 10రోజుల సమయం అడిగారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు చౌహాన్‌శీతల్, జాదవ్‌రవికుమార్, దినేష్‌చౌహాన్‌లున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

బోథ్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లపల్లి గ్రామానికి చెందిన రుచిత జిల్లాస్థాయి కరాటే పోటీలలో ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే ఉన్నత పాఠశాల విద్యార్థులు ఫుట్‌బాల్ ఆటలు జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డీఈవో వెంకటేశ్వర్లు మర్లపల్లి పాఠశాల విద్యార్థులను పీడీ షబ్బీర్, కరాటే మాస్టర్ రాజు, లాడే వార్‌ను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మరింత ప్రతిభను కనబరిచాలని సూచించారు.

నాణ్యత లేని సోయా బస్తాలు వాపస్

● సొసైటీకి వెనక్కి పంపించిన అధికారులు

బోథ్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5 వరకు సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన సోయాబీన్ పంట నాణ్యత లేదని, నాసిరకమైన పంట పంపించారంటూ నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ గోదాంకు వెళ్లిన బస్తాలను అక్కడి అధికారులు సుమారు 228 బస్తాలను బోథ్‌కు తిరిగి పంపించేశారు. విషయం తెలుసుకున్న సహకార సంఘం డైరెక్టర్లు జి.రాజు యాదవ్ ద్యాగల నారాయణ అధికారులు తిరిగి పంపించిన బస్తాలను పరిశీలించారు. స్థానికంగా 4, 5వ తేదీలలో కొనుగోలు చేసిన సోయాబీన్ పంటలో అక్రమాలు జరిగాయని నిర్ధారించారు. తిరిగి పంపించిన పంటను చన్నిపట్టించి పంపించాలని జిల్లా అధికారులు స్థానిక సీఈఓకు ఆదేశాలు పంపించారు. దీంతోస్థానిక అధికారులు జిల్లాస్థాయి అధికారుల ఆదేశానుసారం చన్నీ పట్టించేందుకు సిద్ధమయ్యారు. తిరిగి పంపించిన వాటికి అయ్యే ఖర్చులు సహకార సంఘం భరించదని, దీనికి బాధ్యులైన వారే భరించాలని డైరెక్టర్లు జిల్లా కోపరేటివ్ అధికారి మోహన్ దృష్టికి తెచ్చారు. అయితే సహకార సంఘం జిల్లా అధికారి మాత్రం కొనుగోలుకు బాధ్యులే ఖర్చులు భరించాలని డైరెక్టర్లతో పేర్కొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ హోరెత్తిన ఆందోళనలు

● కేంద్ర హోం మంత్రి దిష్టిబొమ్మల దహనం ● నిరసన ర్యాలీలు ● వ్యతిరేక నినాదాలు



భైంసాలో నిరసన ర్యాలీ



లోకేశ్వరంలో హోం మంత్రి దిష్టిబొమ్మ దహనం



ముథోల్‌లో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

భైంసా, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ సాక్షిగా కేంద్రమంత్రి అమిత్ షా డా.బీఆర్ అంబేద్కర్‌ను అవమానించే రీతిలో చేసిన వ్యాఖ్యలు చేసాడని ఆరోపిస్తూ భైంసాలో దళిత సంఘాలు చేపట్టిన ఆందోళనలు హోరెత్తాయి. గురువారం ఉదయం దళిత సంఘాల ప్రతినిధులు భీంరావ్ డొంగ్రే, శంకర్‌చంద్రే, షైనేకర్ సాయిలు, ప్రసంజిత్‌ఆగ్రే, గంగాదర్‌జాడే, గిరిధర్‌జంగ్మే, యశ్వంత్ బన్సోడే, దగ్డే గంగాధర్ తదితరుల నేతృత్వంలో కేంద్ర మంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా ఆందోళనలు జరిగాయి. బస్టాండ్ ఎదుట గ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట భేటి జరిపిన దళిత సంఘాల శ్రేణులు గంటన్నర పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ముందుగా బీఆర్ అంబేద్కర్ చిత్ర పటాలతో ప్రదర్శనలు చేపట్టారు. అనంతరం కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మకు శవయాత్ర చేపట్టి దహనం చేశారు. అక్కడి నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. కేంద్ర మంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ హోరెత్తించారు.

● అమిత్ షా వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

కేంద్రమంత్రి అమిత్‌షా బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరచేలా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లుగా ముథోల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బోస్లే నారాయణరావ్ పాటిల్ పేర్కొన్నారు. గురువారం భైంసాలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

లోకేశ్వరం మండల కేంద్రంలో

లోకేశ్వరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : భగత్ సింగ్‌చౌక్ వద్ద కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను గురువారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఎం.శంకర్ మాట్లాడుతూ... పార్లమెంట్ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి మంత్రి పదవి అనుభవిస్తూ ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అలాగే ఆయనను వెంటనే మంత్రి పదవికి రాజీనామా, పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆ వ్యాఖ్యలను వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఆయన రాజీనామా చేసే వరకు ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఎం. శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ తాలూకా ఉపాధ్యక్షుడు శ్రీరాములు, మండల గౌరవ అధ్యక్షుడు దండే రమేష్, మాజీ ఎంపీటీసీ సాయన్న, డీలర్ గంగన్న, మండల జనరల్ సెక్రటరీ చందు, కైలాష్, బండి ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ సుధీర్ రెడ్డి, తాలూకా యూత్ అధ్యక్షుడు షఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేత

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం అంబే ద్కర్ సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అంబేద్కర్‌పై అమిత్‌షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు నాయకులు తెలిపారు. అమిత్ షా పదవికి రాజీనామా చేసి బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు ఆర్డీవోకార్యాలయంలో ఇచ్చిన వినతి పత్రంలో డిమాండ్ చేశారు. నాయకులు నిగులపు లింగన్న, ప్రభాకర్, అడ్డిగ లక్ష్మణ్, కే. సురేష్, నవీన్, రవీందర్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముథోల్‌లో ..

ముథోల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను మండల కేంద్రమైన ముథోల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ, అఖిల పక్షం ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు విఠల్ కాంబ్లే, హెచ్. ప్రకాష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగారెడ్డి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, నజీమ్, అఫ్రోజ్ ఖాన్, ఎజాజ్, శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, డి. ప్రసాద్, అశోక్, నగేష్, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటిన భక్తుడు

బాసర, డిసెంబరు, 19: (ఆంధ్రజ్యోతి) : దొరికిన బంగారు ఉంగరాన్ని తిరిగి భక్తుడికి అప్పగించిన ఘటన గురువారం బాసర సరస్వతీ ఆలయంలో జరిగింది. బాసరకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగం రాజేందర్ ఎప్పటిలాగే గురువారం అమ్మవారి దర్శనానికి గుడికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఆలయ ప్రాంగణంలో బంగారు ఉంగరం లభించగా ఆలయ ఇన్స్‌పెక్టర్ గంగాసింగ్‌కు అందించారు. హైదరాబాద్‌కు చెందిన వీరేంద్రకుమార్ అభిషేక పూజ సమయంలో పొగొట్టుకోవడంతో తిరిగి ఆయనకు అప్పగించారు. రాజేందర్ నిజాయితీకి అందరూ అభినందించారు.

న్యాయవ్యవస్థపై విద్యార్థులకు అవగాహన

ఖానాపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో న్యాయవ్యవస్థ ఎంత కీలకమైందో తెలుసుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల గురువారం ఎడ్యుకేషన్ ఫీల్డ్ ట్రిప్‌ను నిర్వహించింది. ఈ ట్రిప్‌లో భాగంగా ఖానాపూర్ కోర్టును సందర్శించిన విద్యార్థులు ఖానాపూర్ కోర్టు న్యాయాధికారి జితిన్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా కోర్టులో జరిగే జడ్జిమెంట్ ప్రాసెస్ గురించి, న్యాయ వ్యవస్థకు సంబంధించి పిల్, రిట్, చిల్డ్రన్ ప్రొటెక్షన్, ఉమెన్ ప్రొటెక్షన్ తదితర విషయాలపై విద్యార్థులు జడ్జి జితిన్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులున్నారు.

మొరం టిప్పర్ల పట్టివేత

బాసర, డిసెంబరు, 19: (ఆంధ్రజ్యోతి) : బాసర మండల కేంద్రంలో అక్రమ మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. గురువారం తహసీల్దార్ పవన్‌చంద్ర ఆదేశాలతో సిబ్బంది రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు.

యాసంగి పంటలకు నాణ్యతమైన విద్యుత్ సరఫరా చేపట్టాలి

● విద్యుత్‌శాఖ ఎస్ఈ సుదర్శనం

భైంసా, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంటలకు నిరంతరమైన నాణ్యతతో కూడిన విద్యుత్ సరఫరా అందించాలని ఆ శాఖ ఎస్ఈ సుదర్శనం సూచించారు. గురువారం భైంసాలో డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేసంగి సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. లోపాలకు తావులేకుండా, అంతరాయలకు అస్కారం లేకుండా వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా చేపట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడకుండా చూడాలన్నారు. ప్రణాళికబద్దమైన విధానాల ద్వారా ట్రాన్స్‌ఫార్మర్ల ఫేయిల్యూర్ లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు . క్షేత్ర స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపడుతూ లూజ్ లైన్లు లేకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు గాను అధికారులు, సిబ్బంది జాగరుకత విధానాలతో విధులు నిర్వహించాలన్నారు. సబ్‌స్టేషన్లలో ఏర్పడే సమస్యలను కాలయాపనకు తావు లేకుండా ఎప్పటికప్పుడే పరిష్కరించుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు ఏర్పడకుండా చూడాలన్నారు . సంబంధిత ప్రక్రియలో అలసత్వ విధానాలను అవలంభించరాదని పేర్కొన్నారు. ఇందులో సీనియర్ అకౌంట్స్ అధికారి సుదర్శన్, డీఈఈ ఎంఆర్‌టీ హరిచంద్ నాయక్, భైంసా డీఈఈ శ్రీనివాస్ రెడ్డి, నిర్మల్ కమర్షియల్ ఏడీఈ లక్ష్మణ్ నాయక్,భైంసా ఏడీఈ కదం అదిత్య, డివిజన్ పరిధిలోని ఏడు మండలాలు, భైంసా పట్టణ పరిధిలో విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆలోచనలకు అవకాశం

● వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ ● బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో ముఖాముఖి



బాసర, డిసెంబరు, 19 : (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థుల ఆలోచనలకు, సూచనలను పరిగణలోకి తీసుకుంటామని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. సాంకేతికరంగంలో ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించే ప్రయత్నంలో గురువారం విద్యార్థులతో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. విపులంగా విద్యార్థులతో సంభాషించారు ప్రొఫెసర్ గోవర్ధన్ విద్యార్థులను సృజనాత్మకంగా ఆలోచించి వాస్తవ ప్రపంచ సమస్యలకు వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయాలని ప్రొత్సహించారు. కార్యక్రమంలో విద్యార్థులు చర్చలలో చురుకుగా పాల్గొన్నారు. విద్యావేత్తలు, పరిశోధనలు, క్యాంపస్ జీవితంతో సహా వివిధ అంశాలపై వారి ఆలోచనలను పంచుకున్నారు. వైస్‌చాన్సలర్ విద్యార్థుల అభిప్రాయాలను ఓపికగా విన్నారు. విలువైన మార్గదర్శకత్వం అంతర్దృష్టులను అందించారు. విశ్వవిద్యాలయ విధానాలు, కార్యక్రమాలను రూపొందించడంలో విద్యార్థి కేంద్రీకృత విధానం యొక్క ప్రాముఖ్యతను వైస్ చాన్సలర్ నొక్కి చెప్పారు. విద్యార్థుల సూచనలను పరిశీలించి సాధ్యమైన చోట అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. విద్యా ర్థులతో పరస్పర చర్చ కార్యక్రమం మంచి ఆదరణ పొందింది. వారితో సన్నిహితంగా వారి దృక్పథాలను అర్థం చేసుకోవడానికి వైస్ చాన్సలర్ చేసిన కృషిని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ మార్గ దర్శకులు ఐఐఎఫ్‌టీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీ దర్శన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఆర్టీల సమ్మెతో మూతబడుతున్న పాఠశాలలు


ఉట్నూర్‌లో నిరవధిక సమ్మె చేస్తున్న సీఆర్టీలు


సీఆర్టీల సమ్మెతో మూతబడిన రాముగూడ ప్రాథమిక పాఠశాల

ఉట్నూర్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్సి టీచర్లు (సీఆర్టీ) తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె ప్రారంభించడంతో గిరిజన ప్రాంతాలలో ఉన్న ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలు మూతబడుతున్నాయి. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ముందు సీఆర్టీలు తలపెట్టిన సమ్మె గురువారానికి నాల్గోరోజుకు చేరింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 1200 మంది సీఆర్టీలు ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రధాన కార్యాలయం ఎదుట సమస్యలను పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తుండడంతో విద్యార్థులకు పాఠాలు బోధించే వారు పాఠశాలలకు రాకపోవడంతో విద్యార్థులు ఆటల బాట పట్టారు. గురువారం ఉట్నూర్ మండలంలోని పలుపాఠశాలలు సందర్శించగా సీఆర్టీలు హాజరుకాకపోవడంతో ఉన్నత పాఠశాలల్లో ప్రధాన సబ్జెక్టులు బోధించే వారు లేక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు.

● విద్యార్థులకు బోధన కరువు

ప్రాథమిక పాఠశాలల సైతం కొన్ని మూతబడగా కొన్నింటిని ఇద్దరు టీచర్లు ఉన్న పాఠశాలల నుంచి ఏకోపాధ్యాయ పాఠశాలలకు ఆయా ప్రాంతాల స్కూల్‌కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఏజెన్సీలో 150 ఏకోపాధ్యాయ పాఠశాలలు మూతబడినట్లు తెలుస్తుంది. నర్సాపూర్(బీ), ఎందా, ఉట్నూర్, హస్నాపూర్, లక్కేటిపేట, ఉట్నూర్ బాలుర, ఉట్నూర్ బాలికల, ఉట్నూర్ పాఠశాలలో సీఆర్టీలు హాజరుకాకపోవడంతో విద్యాబోధన అంతంత మాత్రమే జరుగుతుంది.

నాల్గోరోజు కొనసాగుతున్న సమ్మె...

ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ముందు సీఆర్టీలు తలపెట్టిన నిరవధిక సమ్మె 4వ రోజుకు చేరింది. సీఆర్టీలకు మినమం టైం స్కేల్‌కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని, సీఆర్టీలను క్రమబద్ధీకరించాలని, ప్రతినెల ఒకటో తేదీన గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, మహిళల సీఆర్టీలకు 180 రోజుల ప్రసూతిసెలవులు వర్తింపచేయాలని, ప్రమాదాల భారీన పడి ప్రాణాలు కోల్పోయిన సీఆర్టీలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించాలని, 61 ఏళ్లు నిండిన సీఆర్టీలకు 20 లక్షల రూపాయల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సీఆర్టీలో అందరికి హెల్త్‌కార్డులు కల్పించాలని, మహిళ సీఆర్టీలకు పిల్లల సంరక్షణ కోసం వేతనంతో కూడిన చైల్డ్ కేర్ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ అశోక్‌కుమార్, చౌహాన్‌శీతల్, జాదవ్ రవికుమార్, దిలేష్‌చౌహాన్, మూగశ్రీనివాస్, కుమ్ర శ్రీనివాస్, సీఆర్టీల సంఘం నాయకులు గోడం శ్రీ నివాస్, వినంత్‌రావు, రమేష్, వంశీకృష్ణ, కమలాకర్, విద్యారాని, వందన, ప్రకాష్, మునినాయక్, బద్దు లాల్, విజేష్, శంకర్ తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఆశ్రయమేదీ!?

ఫోటో న్యూస్


పట్టణంలోని నిరాశ్రయుల భవనం


ఇదీ లోపలి గది

ఆదిలాబాద్‌లో వివిధ కూలీపనుల నిమిత్తం వచ్చేవారు.. కుటుంబ సభ్యులు నిరాదరణకు గురైన వారికి ఆశ్రయం కల్పించేందుకు అధికారులు అప్పట్లో నిరాశ్రయుల కేంద్రాలను నిర్మించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కిసాన్‌చౌక్‌తో పాటు రిమ్స్ ఆవరణలో వీటిని నిర్మించారు. రిమ్స్‌కేంద్రం జనానికి ఉపయోగపడుతున్నా కిసాన్‌చౌక్‌లో ఉన్న భవనానికి మాత్రం అధికారులు తాళం వేశారు. దీంతో రాత్రివేళల్లో ఆశ్రయం పొందేందుకు అవకాశం లేకపోవడంతో అనేక మంది నిరాశ్రయులు రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో తలదాచుకోవాల్సి వస్తుంది. చలిలో గజ గజ వణుకుతు ఎలాంటి సౌకర్యాలు లేని ప్రాంతాల్లో నిద్రిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. నిరాశ్రయుల కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకొస్తే అనేక మందికి ఆశ్రయం కల్పించేందుకు అవకాశం ఉంటుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

(ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్‌ఫొటోగ్రాఫర్)




రైల్వేస్టేషన్ ముందు పడుకున్న నిరాశ్రయులు

జాతీయస్థాయి అవార్డు గ్రహీతలకు అభినందన


అధికారులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో అవార్డులు సాధించిన జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారులను, సిబ్బందిని కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం సాయంత్రం కలెకరేట్‌లోని తన ఛాంబర్‌లో అభినందించారు. ప్రశంసా పత్రం, జ్ఞాపికలను కలెక్టర్ చేతుల మీదుగా వారికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జాతీయ స్థాయిలో జిల్లా పేరును నిలబెట్టిన అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. జిల్లాకు రెండు విభాగాల్లో జాతీయ స్థాయి అవార్డులు రావడం గర్వించదగ్గ విషయమని కొనియాడారు. మున్ముందు మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. అవార్డులు అధికారుల పనితీరుకు కొలమానమని తెలిపారు. కాగా నిర్మల్ గ్రామీణ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గణపతి మహిళా స్వయం సహాయ బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమీకృత వ్యవసాయ క్షేత్రానికి, ఉపాధి హామీ పథకంలో భాగంగా అధిక పని దినాలు కల్పించినందుకు గాను పెంబి మండలం ఇటిక్యాల్ గ్రామ ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు, ఉపాధి హామీ కూలీల అవార్డులు లభించాయి. ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రుల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీఎం ఎం. విజయలక్ష్మి, కొండాపూర్ గ్రామ గణపతి స్వయం సహాయక మహిళా సంఘం సభ్యురాలు నవత్‌లక్ష్మీ, నిర్మల్ మండల సమాఖ్య అధ్యక్షురాలు నేరెళ్ల ఉమ, వీవోఏ సుజాత, అడ్డిగ బోసు, ఆర్. సంతోష్ కుమార్, పి. నర్సయ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న చలి తీవ్రత


చలిమంటలు వేసుకుంటున్న కార్మికులు


చలిమంటలు వేసుకుంటున్న జనం

ఆదిలాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గత కొద్ది రోజులుగా ఆదిలాబాద్ జిల్లా పై చలి పంజా విసురుతుంది. దీంతో చలి తీవ్రతతో చలి... చలిగా ఉందంటూ జనం గజగజ వణికిపోతున్నారు. గురువారం జిల్లా గరిష్ట సగటు ఉష్ణోగ్రత 28.3కాగా కనిష్టంగా 6.7 డిగ్రీలుగా నమోదయ్యాయి. అలాగే భీంపూర్ మండలం అర్లి(టి) గ్రామంలో అత్యంత కనిష్టంగా 5.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బేల మండలంలో 6.4, బోథ్‌లో 7.2, మావలలో 7.3, జైనథ్‌లో 7.5, ఆదిలాబాద్‌అర్బన్‌లో 8.1, గాదిగూడలో 9.4, తలమడుగులో 10.0 కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో గత కొద్ది రోజులుగా 15 డిగ్రీల లోపే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జిల్లాలో అతిశీతల మాసాలుగా డిసెంబర్, జనవరి పరిగణిస్తారు. ముఖ్యంగా డిసెంబర్ మాసంలోనే చలి తీవ్రత ఎక్కువగా కనిపిస్తుంది. దీంతో రాత్రి పగలు అనే తేడా లేకుండా చలి ప్రభావం ఉంటుంది. రాబోయే మరో నాలుగైదు రోజుల పాటు చలి ప్రభావం మరింత ఎక్కువగానే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. డిసెంబర్‌లో ఉత్తరాది నుంచి జిల్లా మీదుగా వీస్తున్న శీతల గాలుల ప్రభావంతో చలి తీవ్రత కనిపిస్తుంది. జిల్లాలో సారవంతమైన నల్ల రేగడి నేలలు, దట్టమైన అడవులు, కొండ ప్రాంతాలు ఎక్కువగా ఉండడం కూడా చలి తీవ్రతకు మరోకారణం.

మొక్కజొన్న పంటను పరిశీలించిన ఏరువాక శాస్త్రవేత్తలు

ముథోల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామ శివారులో గురువారం ముథోల్ ఏరువాక శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. అయితే పలు మొక్కజొన్న పంటలలో కత్తెరపురుగు, చలి వాతావరణం, పొలంలో నీరు నిల్వ ఉండటం ద్వారా మొక్కజొన్న ఆకులు ఎరుపు రంగుతో కూడి నీలిరంగులో ఉండటం గమనించడం జరిగిందని పేర్కొన్నారు. కత్తెరపురుగు నివారణకు క్లోరంట్రానీలిప్రోల్ 0.4 మిల్లీ లీటర్లు లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కజొన్న సుడిలో పిచికారి చేయాలని తెలిపారు. భాస్వరం లోపం నివారణకు డీఏపీ 2 శాతం ద్రావణాన్ని 19:19:19 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి 4 నుంచి 5 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలని శాస్త్రవేత్త డా.కార్తీక్ తెలిపారు.


పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ కార్తీక్

అక్రమంగా మొరం తరలిస్తున్న వాహనాలకు జరిమానా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తలమడుగు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆక్రమంగా మొరం తవ్వకాలు అసైన్డ్ భూములను బొందల గడ్డగా మారుస్తున్నారని ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురణ కావడంతో అధికారులు స్పం దించారు. మైనింగ్ అధికారులు పగలు, రాత్రి కాపు కాసి రాత్రివేళ వాహనాలను పట్టుకొని జరిమానా విధించారు. తలమడుగు మండలం కజ్జర్ల శివారు ప్రాంతంలో మొరం తరలిస్తున్న వాహనాలను మైనింగ్ అధికా రులు పట్టుకొని జరిమానా విధించారు. ఈ సందర్భంగా మైనింగ్ టెక్నికల్ అధికారి రమేష్ పవర్ మాట్లాడుతూ. జిల్లా ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు ఏడీ రవీందర్ ఆదేశాలతో అక్రమం గా మొరం తరలిస్తున్న వాహనాలను పట్టుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా ఆ వాహనాలకు జరిమానా విధించమన్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఆక్రమంగా మొరం తరలిస్తే కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. అదేవిధంగా ఆక్రమంగా మొరం తరలిస్తే గ్రామస్తులు కూడా అధికా రులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అధికా రులు రమేష్ పవర్ ,అనుములఖాన్ పాల్గొన్నారు.

యాపల్‌గూడలో ఎన్నికలు.. ఓటేసిన విద్యార్థులు


ఓటింగ్‌లో పాల్గొన్న విద్యార్థినులు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది బలమైన ఆయుధమని, నేతల తల రాతను మార్చేది కూడా ఈ ఓటే. అంతటి బలమైన ఓటు విలువను తెలియజేయడం తో పాటు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలోని జిల్లా పరిషత్ సెకండీరీ పాఠశాలలో వినూత్న కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం ద్వారా ఎన్నికల పట్ల అవగాహన కల్పించడం కోసం పాఠశాలలో మాదిరి ఎన్నికలను నిర్వహించారు. ఈ మాదిరి ఎన్నికల్లో ఎన్నికల అధికారులు, సిబ్బంది, పాత్రను ఆ పాఠశాల విద్యార్థులు పోషించారు. పాఠశాల ఉపాధ్యాయలు దగ్గరుండి విద్యార్థులకు ఎన్నికల విధులు, ఓటు వేయడం వంటి ప్రక్రియలపై అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థులు వరుస క్రమంలో నిలబడి ఓట్లు చేశారు. మరి కొందరు విద్యార్థులు ఎన్నికల అధికారులు, ఉద్యోగుల పాత్రను పోషించారు. దీంతో పాఠశాల ప్రాంగణంలో పోలింగ్ కేంద్రం వాతావరణం నెలకొంది. కారులో జిల్లా ఎన్నికల అధికారి వచ్చి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించడం, జిల్లా ఎస్పీ వచ్చి భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించడం వంటి పనులను కూడా విద్యార్థులే స్వయంగా నిర్వహిండం విశేషం. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయలు వినోద్ రెడ్డి, ఎస్.వినోద్ కుమార్, కె.వేణు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మామిళ్ల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆది దంపతుల కల్యాణోత్సవం


భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం


మల్లికార్జున స్వామి విగ్రహమూర్తులు

నర్సాపూర్(జి), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రకృతి ఒడిలో వెలిసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆది దంపతుల కళ్యాణం శనివారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు నిమ్మ రాములు తెలిపారు. శనివారం ఉదయం 8:30 గంటలకు స్వస్తి పుణ్యాహవాచనం, 9 గంటలకు మూల విరాట్ అభిషేకం, మండల కేంద్రానికి చెందిన వేద పండితులు పాల్దే నరహరి శర్మ ఇంటి వద్ద నుండి భ్రమరాంబిక మల్లికార్జున స్వామివారి ఉత్సవ విగ్రహాలు, త్రిశూలం, నాగఫణి, గంటలను పల్లకిలో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి బాజాభజంత్రీల నడుమ బోయ సంఘం సభ్యులు, భక్తులు తీసుకువస్తారు. అనంతరం వేద పండితులు నరహరి శర్మ, రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్చారణ నడుమ కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 5:30 గంటలకు అభిషేకం అనంతరం బామ్ని(బి) గ్రామం నుంచి భక్త బృందం తీసుకువచ్చిన నైవేద్యం స్వామివారికి సమర్పించిన అనంతరం జాతర ప్రారంభమవుతుంది. రైతులు, భక్తులు నూత నంగా పండించిన వరి ధాన్యం, బెల్లం, మజ్జిగ, వంకాయ, కూరగాయలతో తయారు చేసిన, పాయసం, నైవేద్యం స్వామివారికి సమర్పించి, ఒగ్గు కళాకారులకు భోజనం పెట్టి ఉపవాస దీక్షలు విడిచి పెడతారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ వైస్ ప్రెసిడెంట్ భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సెక్రటరీ నిమ్మ సుశీల రాములు దంపతులు శనివారం జరిగే కళ్యాణంలో పాల్గొంటారని తెలిపారు. కళ్యాణం అనంతరం మహా అన్నదాన కార్యక్ర మం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు బక్కన్న, దత్తురాం, నరేందర్, సాయికృష్ణ తెలిపారు.

కల్యాణం జరిపించే అవకాశం లభించినందుకు ఆనందంగా ఉంది..

● నిమ్మల సుశీల రాములు

భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం మా చేతుల మీదుగా జరిపించడం చాలా ఆనందంగా ప్రభుత్వ ఉద్యోగిగా సేవలు అందించి రిటైర్మెంట్ తర్వాత స్వామి వారి కళ్యాణం జరిపించడం అదృష్టంగా భావిస్తున్నాను.

జాతరకు భారీ బందోబస్తు..

● ఎస్సై సాయికిరణ్




శనివారం, ఆదివారం జరిగే దేవుని చెరువు జాతరకు తరలివస్తున్న భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నాము. వాహనాలు ట్రాఫిక్ జామ్ కాకుండా రోడ్డు మార్గాలను ఏర్పాటు చేశాం. జిల్లా పరిషత్ పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు, పోలీసులతో భారీభద్రత ఏర్పాట్లు చేశాం.

నిరంతర విద్యుత్తు సరఫరాకు చర్యలు

భైంసా, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయల నివారణకు ఆ శాఖ పకడ్బందీ చర్యలు చేపడుతోంది. గత కొంత కాలంగా ట్రాన్స్‌ఫార్మర్లపై పక్షులు వాలిన , తొండలు వంటి జీవరాసులు సంచరించిన లైన్‌లో ట్రిప్పు ఏర్పడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. అంతేకాకుండా జీవరాసులు మృత్యువాతయ కూడ పడుతున్నాయి. ప్రధానంగా ట్రాన్స్‌ఫార్మర్ హెచ్‌జీ ఫ్యూజ్ సెట్ ద్వారా ఇలాంటి సమస్యలు అధికంగా ఉత్పన్నవముతున్నాయి. సంబంధిత సమస్యల నివారణ విద్యుత్ శాఖ అధికార యంత్రాంగం ప్రణాళికబద్ధమైన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగానే ట్రాన్స్‌ఫార్మర్ హెచ్‌జీ ఫ్యూజ్ సెట్లపై పక్షులు వాలిన, జీవరాసులు సంచరించిన ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా పైప్ తొడుగులు ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా లైన్ ట్రిప్పు జరుగకుండా, సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఉండనుందని విద్యుత్ శాఖాధికారులు తెలుపుతున్నారు. దీనికి తోడు హెచ్‌జీ ఫ్యూజ్‌పై తొండలు సంచరించి, పక్షులు వాలిన అవి విద్యుత్ ప్రమాదాల బారిన పడి మృతి చెందే పరిస్థితులు లేకుండా పోతుందని వివరించారు. పట్టణంలోని 26 వార్డుల పరిధిలో దాదాపు 325పైగా ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా వాటన్నింటి వద్ద సంబంధిత పైప్ తొడుగులు ఏర్పాటు చేస్తున్నట్లుగా విద్యుత్ శాఖాధికారులు తెలిపారు.


మరమ్మతు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.3, కనిష్ఠం 6.7
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
శుక్రవారం 20 డిసెంబరు 2024



పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

నేరడిగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా చేపడుతున్నామని ఎంపీడీఓ రాజ్‌వీర్ అన్నారు. గురువారం మండలంలోని వడూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఇంటికి వెళ్లి సిబ్బంది పరిశీలిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతామని, ఇళ్ల మంజూరులో లోపాలు లేకుండా చూస్తామని వెల్లడించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సద్దాం, టీఏ వినోద్ తదితరులున్నారు.

- కశ్మీర్‌ను తలపిస్తున్న ఆదిలాబాద్ వీధులు
- రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదు
- రికార్డు స్థాయిలో వరుసగా సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు
- శీతల గాలుల ప్రభావంతో వణికిపోతున్న జనం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు


పట్టణ పరిసర ప్రాంతాలపై కమ్మేసిన పొగమంచు

గజ గజ!

డిసెంబరు 14 నుంచి 19 వరకు జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
డిసెంబరు14	27.3	6.2
డిసెంబరు15	26.8	4.7
డిసెంబరు16	27.8	5.2
డిసెంబరు17	29.0	6.2
డిసెంబరు18	28.5	6.7
డిసెంబరు19	28.3	6.7


జిల్లాకేంద్రంలో దట్టమైన పొగమంచు



ఆదిలాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో కురుస్తున్న దట్టమైన పొగమంచుతో జిల్లా పరిసరప్రాంతాలు మరో కాశ్మీర్‌ను తలపిస్తున్నాయి. ఉదయం సాయంత్రం వేళల్లో ఎటు చూసిన దట్టమైన పొగమంచే కనిపిస్తుంది. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదవుతున్నాయి. ఈ సీజన్‌లో రికార్డుస్థాయిలో 4.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలలో పెద్దగా తేడా లేకపోయినా కనిష్ఠ ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. దీంతో పగలు రాత్రి తీవ్రమైన చలే కనిపిస్తుంది. పట్టపగలే చలిమంటలు వేసుకుంటు వెచ్చదనం పొందుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు, వ్యవసాయ కూలీలు, మున్సిపల్ కార్మికులు తీవ్రమైన చలితో గజగజ వణికిపోతున్నారు. మార్నింగ్ వాక్ చేసే వారంతా సూర్యుడు ఉదయించిన తర్వాతే ఆలస్యంగా వాకింగ్ వెళ్తున్నారు. గురువారం జిల్లా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 28.3డిగ్రీలు కాగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6.7గా నమోదయ్యాయి. ప్రతీయేటా డిసెంబర్ మాసంలోనే కనిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈనెల 23 వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. చలి తీవ్రతతో జర జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే తీవ్రమైన చలితో పాఠశాలల పని వేళల్లో మార్పు చేశారు. దీంతో విద్యార్థులకు చలి నుంచి కొంత ఉపశమనం కలిగింది. ఉదయం తీవ్రమైన చలితో బడికి వెళ్లేందుకు భయపడడంతో పాఠశాలల్లో భారీగా హాజరుశాతం పడిపోతుందని అధికారులు చెబుతున్నారు.

• వణికిపోతున్న అర్లి(టి)

జిల్లాలో అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు అర్లి(టి) గ్రామంలో నమోదవుతున్నాయి. తాజాగా అర్లి(టి)లో 5.8 డిగ్రీల అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో చలి ప్రభావం తీవ్రంగా కనిపిస్తుంది. భీంపూర్ మండలం మారుమూల గిరిజన గ్రామమైన అర్లి(టి)లో అన్ని కాలాల ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. వేసవి, వాన, శీతాకాలాలు మూడుఅధికంగానే ప్రభావాన్ని చూపుతాయి. ఈ గ్రామంలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో పాటు కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. దీని తర్వాత బేల, జైనథ్, మావల, బోథ్ మండలాల్లోనూ అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లోనే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా గుట్ట ప్రాంతాలు, కొండలు, దట్టమైన అడవులు, నదులు, లోతైన ప్రాంతాల్లోనే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

• శీతల మాసాలుగా డిసెంబరు, జనవరి

జిల్లాలో అతిశీతల మాసాలుగా డిసెంబర్, జనవరి మాసాలను పరిగణిస్తారు. ముఖ్యంగా డిసెంబర్ మాసంలోనే చలితీవ్రత ఎక్కువగా కనిపిస్తుంది. దీంతో రాత్రి పగలు అంతా చలితో గజగజ వణికిపోతున్నారు. రాబోయే మరో నాలుగైదు రోజుల పాటు చలి ప్రభావం ఎక్కువగానే ఉంటుందని తెలుస్తుంది. డిసెంబర్ మాసంలో ఉత్తరాది నుంచి జిల్లా మీదుగా వీస్తున్న శీతల గాలుల ప్రభావంతో చలితీవ్రత కనిపిస్తోంది. అలాగే జిల్లాలో సారవంతమైన నల్ల రేగడి నేలలు, దట్టమైన అడవులు, కొండ ప్రాంతాలు ఎక్కువగా ఉండడం (తరువాయి 6వ పేజీలో...)


చలిమంటలు కాగుతున్న ప్రజలు

అర్ధరాత్రి మైనింగ్ అధికారుల దాడులు

- అక్రమంగా మొరం తరలిస్తున్న వాహనాలకు జరిమానా
- అనుమతి లేకుండా మొరం తరలిస్తే చర్యలు తప్పవంటున్న అధికారులు 7



సీఆర్టీల సమ్మెతో మూతబడుతున్న పాఠశాలలు

- విద్యార్థులకు బోధన కరువు
- చర్యలు తీసుకోవాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు 7



నాణ్యత లేని సోయా బస్తాలు వాపస్!

- 228 బస్తాలను సొసైటీకి పంపించిన అధికారులు 6



పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితమైన వాటిని వాడుతూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్ రాష్ట్ర కోఆర్డినేటర్ విద్యాసాగర్ అన్నారు. ఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఆయా పాఠశాల విద్యార్థులకు గురువారం డైట్ కళాశాలలో ఇకో ఫ్రెండ్లీ సోప్, లిక్విడ్, డిష్ బార్‌లను ఎలా తయారు చేయాలో అవగాహన కల్పించారు. టెక్నికల్ సిబ్బంది కార్తీక్ సబ్బులు తయారు చేసే విధానం గురించి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్ స్టేట్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో లభించే రసాయనిక సబ్బుల కారణంగా ఎన్నో చర్మ వ్యాధులు వస్తాయన్నారు. మనుషులతోపాటు పర్యావరణాన్ని హాని కలిగించే సబ్బులస్థానంలో ఇకో ఫ్రెండ్లీ విధానంతో తయారుచేసిన సబస్సులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ అర్బన్, రూరల్ ఎంఈఓలు సోమయ్య, కంటే నర్సయ్య, డైట్ వైస్ ప్రిన్సిపల్ కిరణ్ కుమార్, భరంపూర్ పీజీహెచ్‌ఎం ప్రత్యూష, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ మృతి

ఉట్నూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పత్తి ఏరేందుకు వెళ్లిన ఓ వ్యవసాయ కూలీ మండలంలోని ఎక్స్ రోడ్‌సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన ఆరుగురు మహిళలు నాగపూర్ ప్రాంతంలో పత్తి ఏరడానికి గురువారం కూలీ పనులకు వెళ్లారు. సాయం కాలం తిరిగి ఆటోలో వస్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. దీంతో అందులో ఉన్న కొత్తగూడ గ్రామానికి చెందిన రేణుకబాయి (45) మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులను ఉట్నూర్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. రేణుకబాయి శవాన్ని ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఉట్నూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆటోను ఢీకొట్టిన కారు ఆసిఫాబాద్ జిల్లాకు చెందినదిగా భావిస్తున్నారు.

సజావుగా బూత్ కమిటీ ఎన్నికలు

ఉట్నూర్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బూత్‌కమిటీల ఎన్నికలు సజావుగా ప్రారంభమయ్యాయి. అధిష్టానం ఆదేశాల మేరకు బూత్‌కమిటీ ఎన్నికల కార్యక్రమంలో భాగంగా గురువారం ఉట్నూర్ మండలంలోని వడ్గల్‌పూర్‌కే, కోపర్‌గాడ్ గ్రామాల్లో బూత్‌కమిటీ ఎన్నికలు నిర్వహించినట్లు జిల్లా కార్యదర్శి బూత్ కమిటీ ఎన్నికల కన్వీనర్ కొండేరి రమేష్ తెలిపారు. కార్యక్రమంలో కోకన్వీనర్ సల్గారే రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి బింగి వెంకటేశ్, జిల్లా నాయకులు తన్నీరు సతీష్, కైలాస్, భారతీయ జనతా పార్టీ గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు పెంచి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

బోథ్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డేరాకు చెందిన మెస్రం నారాయణ గంజాయి మొక్కలను పెంచి విక్రయిస్తున్నాడన్న సమాచారంతో బుధవారం మధ్యాహ్నం స్థానిక సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై ప్రవీణ్ సిబ్బందితో కలిసి డేరా గ్రామంలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో నారాయణ పెరటిలో 8 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే 360గ్రాములు గంజాయి విక్రయించగా వచ్చిన రూ.10వేల సైతం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పట్టుబడిన మొత్తం గంజాయి విలువ రూ.19వేలు ఉంటుందన్నారు. మెస్రం నారాయణను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి సేవించినా, మొక్కలు పెంచినా, అమ్మిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

కించపరిచేలా మాట్లాడడం సరైంది కాదు

• దళిత సంఘాల నాయకులు రత్నజాడేప్రజ్ఞకుమార్ • కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఫ్లెక్సీ దహనం

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో కేంద్రహోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను కించపరిచే విధంగా మాట్లాడారని, వెంటనే క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల నాయకులు రత్నజాడే ప్రజ్ఞకుమార్ డిమాండ్‌చేశారు. హోంమంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం మహాప్రజ్ఞా బుద్దవిహార్ ఎదుటగల జాతీయ రహదారిపై అమిత్‌షా ఫ్లెక్సీని దళిత సంఘాల ఆధ్వర్యంలో దహనం చేశారు. అమిత్‌సాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ప్రజాస్వామిక భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహోన్నతమైన వ్యక్తి బాబాసాహెబ్ అంబేద్కర్ అని దళిత సంఘాల నాయకులు రత్నాజాడే ప్రజ్ఞకుమార్ అన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి కించపరిచేలా మాట్లాడడం సరైన విధానం కాదన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మెట్టు ప్రహ్లాద్, ఈశ్వర్, మేకల మల్లన్న, ఉదయ్, కుశ్వర్త బాయిలాండ్గే తదితరులున్నారు.


అమిత్‌షా దిష్టబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

ఆదిలాబాద్‌రూరల్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను కించపరిచేలా మాట్లాడారని, వెంటనే క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల నాయకులు రత్నజాడే ప్రజ్ఞాకుమార్ అన్నారు. హోం మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం మహా ప్రజ్ఞా బుద్దవిహార్ ఎదుట గల జాతీయ రహదారిపై షా ఫ్లెక్సీని దళిత సంఘాల ఆధ్వర్యంలో దహనం చేశారు. అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మెట్టు ప్రహ్లాద్, ఈశ్వర్, మేకల మల్లన్న, ఉదయ్, కుశ్వర్తబాయి లాండ్గే పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు దురదృష్టకరం

నార్నూర్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ లోకండే అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, దేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడైన అంబేద్కర్‌ను అమిత్‌షా అవమానించడం ఘోరమన్నారు. వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను కోట్లమంది ఆరాధిస్తారని అన్నారు. ఆయన వెంట కేశవ్, సిద్ధు, సునీల్ తదితరులున్నారు.

అర్హత కలిగిన సంఘాలకు రుణాలు ఇవ్వాలి

• కలెక్టర్ రాజార్షిషా


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షిషా


పాల్గొన్న అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన మహిళా సంఘాలకు రుణాలు అందించాలని కలెక్టర్ రాజార్షిషా అధికారులను ఆదేశించారు. డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ వార్షి క క్రెడిట్ టార్గెట్ అచివ్‌మెంట్‌పై సంబంధిత అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజార్షిషా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భ ంగా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకులింకేజి ద్వారా అర్హత కలిగిన సంఘాలకు టార్గెట్ ప్రకారం రుణాలను అందించి, జిల్లా లక్ష్యాలను సాధించాలన్నారు. అదేవిధంగా రుణాల పంపిణీతో పాటు వంద శాతం రికవరీ చేయాలని సూచించారు. అలాగే క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్షించాలని పేర్కొన్నారు. జిల్లాలో విజయ పాల అమ్మకాలు విస్తృత పరిచే దిశగా, ప్రయోగాత్మకంగా 500 మంది పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మహిళ సభ్యులు విజయ సఖీ పేర విజయపాలు, పాల ఉత్పత్తుల విక్రయం చేపట్టే ప్రతిపాదన విజయ డీడీ మధుసూదన్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా ఆసక్తి గల మహిళ సభ్యులు 100 మందికి మొదట ప్రతిపాదించిన రూ.25వేల రుణాన్ని ఇవ్వడానికి అంగీకరించినట్లు తెలిపారు. అలాగే మండల కేంద్రాల్లో, మహిళా సభ్యులతో ఈ విజయపాల అమ్మకాలు చేపట్టాలని డీఆర్‌డీఓ సాయన్నను కలెక్టర్ ఆదేశించారు. మహిళా సంఘాల సభ్యులను ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో ట్రైని కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, లీడ్ బ్యాంకు మేనేజర్ ఉత్పల్‌కుమార్,ఆర్‌ఎంటీజీబీ ప్రభుదాస్,నాబార్డు అబ్దుల్ రవుఫ్, సంబంధిత అధికారులు, వివిధ బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు

ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలి

• కలెక్టరేట్ ఎదుట ఏఎన్‌ఎంల 48 గంటల నిరసన

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి పరీక్ష విధానం లేకుండా వైద్య ఆరోగ్యలో కాంట్రాక్టు ప్రతిపాదికన విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలని తెలంగాణ వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ నవీన్ డిమాండ్ చేశారు. తెలంగాణ వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట 48 గంటల నిరసన చేపట్టారు. గురువారం తొలిరోజు వీరి నిరసనకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న మద్దతు తెలిపారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ నవీన్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో 20 సంవత్సరాలుగా చాలీచాలని వేతనంతో కాంట్రాక్ట్ పద్ధతిన ఏఎన్‌ఎంలు పని చేస్తున్నారని అన్నారు. ఇన్నాళ్లు ఎంతో పనిభారంతో పని చేస్తూ వచ్చారన్నారు. ప్రస్తుతం వయసు కూడా పెరుగిపోయిందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సమ్మెలో చేసిన సందర్భంలో రెగ్యూలర్ చేస్తామని హామీ ఇచ్చి కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు పుష్పల, ఆనందబాయి, పద్మ, తులసి లలిత, మనీలత, ప్రియదర్శిని, అనురాధ, అహల్య, లక్ష్మీ, కరుణ పాల్గొన్నారు.